

గొడ్రాలు!

సుశీలను ఆ వీధిలోని అమ్మలక్కలందరూ అలాగే పిలుస్తారు. ఆమె ముఖం చూస్తేనే పాపమన్నట్టు ముఖం తిప్పుకుంటారు. పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు ఆమె నీడను కూడా సహించలేరు. దానికి తోడు పెళ్ళయ్యి పదేళ్ళు దాటిపోతున్నా... పెళ్ళాంతో సుఖం లేక పిల్లలు పుట్టడం లేదనే విరక్తితో... ఆమె భర్త ఎక్కడికో వెళ్ళిపోయాడని...ఇప్పుడిప్పుడే ఆ వీధంతా కోడై కూసుకుంటుంది.

పాపం సుశీల అవన్నీ సహిస్తూ... మనసు పుట్టకపోవడానికి అసలు నిజం — తనకూ, తన భర్తకూ మాత్రమే తెలుసు. కానీ ఆ నిజాన్ని బయటకు చెప్పుకో లేక... అందరూ అనే మాటల్ని భరిస్తూ వస్తుంది.

సుశీల మనసులోని మథనం ఆ దేవుడికే తెలియాలి. అందరిలాగే పిల్లలను కావాలనీ — హృదయానికి పసికందుని హత్తుకుని మాతృత్వపు రుచి చవిచూడాలని... ఆమెకు మాత్రం ఎందుకుండదు? ప్రతి క్షణం పిల్లల కోసం ఎంతగా పరితపిస్తుందో ఆ అమ్మలక్కల కేం తెలుసు? కానీ... తన భర్త ద్వారా ఆమెకు పిల్లలు పుట్టడం సాధ్యమా...? అందుకే... సుశీల కుళ్ళి కుళ్ళి కుమిలిపోతూ వుంటుంది.

- ఎస్. ప్రసన్నలక్ష్మి

సుశీల భర్త ఇల్లు వదిలి వెళ్లాళ్ళు అవుతుంది. ఆమెకు పిల్లలు లేరన్న బాధేగానీ... దూరంగా భర్త ఎడబాటై పోయాడన్న చింత రవ్వంతైనా లేదు. అతమండి యేం ప్రయోజనం? అతనే గనుక ఆమెకు భర్త అయివుండకపోతే ఈపాటికి పది మంది పిల్లలకు తల్లియైవుంటేది. అతన్ని పెళ్ళి చేసుకోవడం వలనే... ఆమె గొడ్రాలు జీవితాన్ని అనుభవించాల్సి వస్తుంది. ఆ గొడ్రాలనే మాటతే ఆమెలో మానసికంగా చిత్రవధ చేస్తుంది. ఆ ముద్ర చెరుపుకోవాలనే ఆరాటం ఆమె నవనాడుల్లోనూ జీర్ణించుకుపోయింది.



అందుకే... సుశీల ఆలోచిస్తుంది. తను తల్లి కావాలనే కాంక్షతో... విపరీతంగా ఆలోచిస్తూనే వుంది.

సుశీలకు పిల్లలు పుట్టలేనందుకో... ఇంకా కన్యగానే మిగిలిపోయినందుకో గానీ... ఆమెలో పదహారేళ్ళప్పుడు విచ్చుకున్న యవ్వన సొంపుల అందం ఇరవై అయిదేళ్ళు నిండినా వాడిపోలేదు. ఆమెలో ఏదో కావాలని కాంక్షగా చూసే మగ చూపులయితే ఎన్నో? అటువంటి చూపుల్లో... ఈ మధ్యే ఎదురింటి రూమ్‌లో కొత్తగా దిగిన పాతికేళ్ళ కుర్రాడివి కూడా వున్నాయి.

సుశీల ఆలోచనలకు అతను గుర్తుకు రాగానే... ఎదురింటి వైపు చూసింది.

అతనెప్పటిలాగే... చదువుకోకుండా పుస్తకాన్ని పట్టుకుని... కిటికీలోంచి తన వైపే చూస్తున్నాడు.

అంతే... సుశీల ఒక నిశ్చయానికొచ్చేసింది.

తానొక ఇల్లాలినన్న మాట మరచిపోయి... అతని వైపు చూస్తూ... చిన్నగా నవ్వింది.

అతని ఆశ్చర్యానికయితె అంతే లేదు. తన వలలో పడుతుందని మురిసిపోతూ... అతను కూడా నవ్వును బదులిచ్చాడు.

ఒకరి కొకరు రోజూ చూసుకుంటూ... నవ్వుకుంటూ... సైగలు చేసుకుంటూనే వున్నారు.

సుశీల అతనికి చేసిన సైగ ప్రకారం...

ఓ రోజు రాత్రి... గడియ తీసి వుంచిన తలుపును తోసుకుంటూ... సుశీల ఇంట్లో చొరబడ్డాడు అతను.

తెల్లచీర... మల్లెపూల సింగారంతో... వయ్యారంగా తన పక్కలోకి ఆహ్వానించింది అతన్ని. ఆ చీకట్లో... ఓ ఆడా, మగా మధ్య జరిగేదంతా జరిగిపోయింది.

సుశీల కళ్ళల్లో నీళ్ళు. అవి ఇన్నాళ్ళకు కన్యత్వం నుంచి విముక్తి పొందినందుకో... త్వరలో తన లక్ష్యం సాధించబోతున్నందుకో తెలీదుగానీ... అవి సంతోష బాష్పాలనే చెప్పాలి.

కొన్నాళ్ళపాటు తనకు అలాగే దగ్గర

కమ్మంటూ అతన్ని వేడుకుంది. అటువంటి అవకాశాన్ని ఏ మగాడు వదులుకుంటాడు...?

సుశీలకు ఆ రోజులాగే ఎన్నో రహస్య రాత్రులయిపోయాయి — అతనితో.

అతని కారణంగా — సుశీల నెల తప్పింది!

సుశీల ఆనందానికి అంతు లేదు. తనూ తల్లి కాబోతున్నందుకు పరవశించిపోయింది. తన బిడ్డను గుండెల హత్తుకుని పాలిస్తున్నట్టూ... ఉయ్యాలలో వేసి జోల పాటపాడుతున్నట్టూ... చందమామని చూపిస్తూ గోరుముద్దలు తినిపిస్తున్నట్టూ ... ఎన్నో కలలు కంది.

సుశీల తనకు తానుగా ఎదురింటతనికి లొంగిపోయినా... కీడెంచి మేలెంచమన్నారు కాబట్టి... సుశీల నెల తప్పిందని తెలియగానే ... మెల్లగా అతను ఆ రూమ్ నుంచి జారుకున్నాడు.

అతని పిరికితనానికి నవ్వుకుంది సుశీల. ఏది ఏమైనా... అతను తనకు వరాన్ని ప్రసాదించిన దేవుడు. గొడ్రాలు అనే ముసుగునుంచి బయట పడేస్తున్న దయామయుడు. మనసులోనే కోటి వందనాలర్పించుకుంది — అతనికి.

సుశీలకు నెలలు నిండేకొద్దీ... అసలు విషయం బయటపడింది. ఆ వీధంతా... సుశీల నీళ్ళోసుకుందని పాకిపోయింది.

ఇంతటి శుభవార్తని మరి చెప్పలేదేమమ్మా...? దానంతటది బయటపడితేనేగాని మాకు తెలనకూడదనుకున్నావేంటి...? ఈ సమయంలో నీ మొగుడుంటే ఎంత సంతోషించేవాడో కదా! జాగ్రత్తమ్మా... కడుపును చల్లగా చూసుకో... అంటూ ఆ వీధిలోని అమ్మలక్కలందరూ వచ్చి సంతోషించి వెళ్ళారు.

తను తల్లికాబోతున్నందుకు — అదంతా తన భర్త ఘనకార్యమే అనుకుంటున్న ఆ అమాయకులను చూసి మనసులోనే నవ్వుకుంది. ఇన్నాళ్ళకయినా... తనపై వాళ్ళకందరికీ దయ కలిగి... మనిషిగా చూడడానికి వచ్చారంటే... తనూ తల్లి కాబోతున్నందుకే కదా!

అప్పుడు తెలిసింది సుశీలకు — మాతృత్వానికి గల విలువ.

నెలలు నిండాయి! కడుపులోని బిడ్డ ఎంత త్వరగా బయటపడుతుందా అని ఆతృతగా ఎదురుచూస్తుంది — సుశీల.

సుశీల ప్రసవ వేదన అనుభవించి అనుభవించి... విజయాన్ని వేరుకుంది...

ఆమెకు — మగపిల్లాడు పుట్టాడు!

ఆ పిల్లాడు పసిమిఛాయలో... అందంగా... అచ్చం ఆమె పోలికే.

మగపిల్లాడికి తల్లి పోలిక వస్తే అదృష్టవంతుడంటారు. ఆ క్షణం... సుశీల అనుభవించిన వేదనంతా మటుమాయం అయిపోయింది. ప్రపంచాన్ని జయించినంత సంతోషంతో ఉక్కిరి బిక్కిరయింది. పిల్లాడిని గుండెలకు హత్తుకుని ముద్దుల వర్షం కురిపించేసింది. తనూ తల్లినైపోయాననే విజయగర్వంతో... పిల్లాడికి పాలిస్తూ... మాతృత్వపు రుచిని చవిచూస్తూ... అందులో వున్న ఆనందానికి పొంగిపోయింది.

సుశీలకు ఆ వీధి వాళ్ళ నిందలు తప్పాయి. ఆమెను మనిషిగా చూస్తూ... గొడ్రాలు అనే ముద్రను తుడిచేశారు.

పిల్లాడు — రోజురోజుకీ పెరుగుతున్నాడు.

వాడి ఆటపాటలతో... ఆనందంగా రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి — సుశీలకు.

ఓ రోజు...

ఉన్నట్టుండి హఠాత్తుగా వూడిపడ్డాడు — సుశీల భర్త.

తన బిడ్డే సర్వస్వంగా బ్రతుకుతున్న సుశీల తనకొక భర్త వున్నాడన్న మాటే పూర్తిగా మరచిపోయింది. భర్త రాకతో... ఓ క్షణం కలవరపడినా... ధైర్యాన్నే ఊపిరిగా తీసుకుంది.

తప్పటడుగులు వేస్తూ... ఆట బొమ్మలతో ఆడుకుంటున్న ఆ పిల్లాడిని చూసి... "ఈ బాబు ఎవరు...?" ప్రశ్నార్థకంగా అడిగాడు సుశీల భర్త.

"నా కొడుకే!" తడబడకుండా సమాధానమిచ్చింది సుశీల.

ఖంగుతిన్నాడు — ఆమె భర్త.

"ఇంకా నయం. మన పిల్లాడే అనలేదు". వెకిలిగా నవ్వి... పొరుగింటివాళ్ళ పిల్లాడా?" జోక్ చేసిందనుకుని మళ్ళీ అడిగాడు.

"లేదు... నా పిల్లాడే!" మళ్ళీ సుశీల నోటి నుంచి అదే జవాబు.

"జోక్ చేయకు" మరోసారి రెట్టించాడు.

"ఇది జోక్ కాదు. వాడు నిజంగా నా కన్నకొడుకు" — సుశీల గొంతులోని స్థిరత్వానికి... ఆశ్చర్యంతో పాటు... కోపంతో రగిలిపోయి... "నోర్ముయ్" అన్నాడామె భర్త.

"నోర్ముయ్యడానికి ఇందులో అబద్ధం లేదు" రెచ్చకొట్టింది సుశీల.

అంతే — సుశీల చెంప చెళ్ మనిపించి

మినీ కథా పోటీ

## ఈ బొమ్మకు కథ వ్రాయండి!



ఇక్కడ ఇచ్చిన చిత్రానికి అనుగుణంగా ఒక చక్కని మినీ కథ రెండు అర తావులు మించకుండా వ్రాసి **ఈ నెల** 20వ తేదీ లోగా పంపించాలి.

మాకు వచ్చిన కథలలో ఉత్తమమైన కథ ఎన్నిక చేసి రూ. 50/- బహుమతిగా అందజేస్తాము. కథ రెండు అర తావులు మించరాదు. దీని గురించి వేరే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం జరగదు.

సంపాదకునిదే తుది నిర్ణయం.

కథ వ్రాసిన అర తావు కాగితం వెనక మీ పూర్తి చిరునామా వ్రాయాలి. మీ కథలు, 'బొమ్మకు కథ' శీర్షికకు ఎడిటర్ వనితా జ్యోతి, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, లబ్బీపేట, విజయవాడ-520 010. చిరునామాకు పంపాలి.

—ఎడిటర్

## కార్టూన్‌కు మంచి జోక్ వ్రాయండి

ఇక్కడ ప్రచురించిన కార్టూన్‌కు నవ్వు పుట్టించే ఒక చక్కని జోకు ఆలోచించి వ్రాయండి.

మాకు వచ్చిన జోక్స్ నుండి ఉత్తమంగా ఎన్నికయిన జోక్‌కు రూ. 50/- బహుమతిగా అందజేస్తాము.

జోక్‌ని ఒక పోస్ట్ కార్డుపై వ్రాసి 'కార్టూన్ జోక్ శీర్షికకు' ఎడిటర్, వనితా జ్యోతి, ఆంధ్ర జ్యోతి బిల్డింగ్స్, లబ్బీపేట, విజయవాడ-520 010 చిరునామాకు ఈ నెల 10వ తేదీలోగా అందేలా పంపించాలి.

—ఎడిటర్



## కార్టూన్ జోక్ పోటీలో ఎన్నికయిన జోక్

ఈ శీర్షికకు పాఠకులు ఉత్సాహంగా జోక్స్ వ్రాసి పంపారు. వారందరికీ అభినందనలు. క్రిందటి నెల ఇచ్చిన కార్టూన్‌కి మాకు వచ్చిన జోక్స్‌లో ఈ క్రింది జోక్ బహుమతికి ఎన్నికయింది. వీరికి బహుమతి సొమ్ము అందజేస్తాము.

తల్లి: వాడికి అంత ఖర్చు పెట్టి డాక్టరు చెప్పించారు. కానీ ఒక్క స్టెతస్కోప్ కొని ఇవ్వండీ అంటే విన్నారు కాదు. ఆడ పేషంట్లు వచ్చినప్పుడల్లా వాడు పడే పాట్లు చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది!

—పంపినవారు
పాలపర్తి లక్ష్మీశ్రీనివాసరావు, అన్నపర్రు



"ఎవడికి పుట్టాడు?" నిలదీసి అడిగాడు.

సమాధానం చెప్పకుండా మౌనంగా నిలబడిపోయింది సుశీల. అంతలోనే... ఆమెలో ఏదో తెగువ. మరో దెబ్బ తన వంటి మీద పడనీయకూడదనుకుంది.

"ఎవరి వలన పుట్టాడే..." అంటూ మరో పిడి గుద్దు గుద్దబోతున్న భర్తను — ఆగంటూ అతని చేతిని విసురుగా తోసి... కళ్ళలోకి తీక్షణంగా చూసింది.

"ఎవడికి పుట్టాడని అడుగుతున్నావు కదూ! నీ కాపని చేతకానప్పుడు ఎవడికి పుడితే నేం? నీలో నపుంసకత్వాన్ని దాచుకుని... అసలు నువ్వెందుకు పెళ్ళి చేసుకున్నట్టు? ఎలాగూ సంసార సుఖానికి పనికిరావు కదాని నువ్వెక్కడికో వెళ్ళిపోతే ఆ వెనుక నేనెన్ని అపవాదు లనుభవించానో నీకు తెలీదు. పదేళ్ళుగా ఏనాడూ నీతో ఆ సుఖమంటూ ఎరుగని నాకు పిల్లలెలా పుడతారు? పైకి చెప్పకోలేని ఈ విషయాన్ని మనుషులెలా గుర్తిస్తారు? ఏ పాపమూ, లోపమూ ఎరుగని నన్ను 'గొడ్రాలు' అని అందరూ అంటూ మనిషిగా చూడకుండా ... నా మనసును కుళ్ళబొడుస్తుంటే... విని ఎలా భరించమంటావు? అందరిలాగే తల్లి నవ్వాలనే కోర్కె నాకుండదూ? పెళ్ళి చేసుకుని నీతోనూ సుఖము లేక... పిల్లలు లేని గొడ్రాలుగా ఊరి వాళ్ళ సాధింపులకు మనశ్శాంతిని పోగొట్టుకుని... ఎన్నాళ్ళని ఏకాకిలా ఈ నికృష్టపు బ్రతుకు బ్రతకను? అందుకే... నీలో వున్న లోపాన్ని బయటకు చెప్పకోలేక... గొడ్రాలు అనే ముదనష్టపు బిరుదు నుంచి బయటపడి... మాతృత్వాన్ని పొందాలనే ఆశతో ... నా మనస్తాపానికి మందు పోసుకోవాలనీ... స్వార్థంతో ఓ కుర్రాడితో కులికాను. అలా కులకడం వలనే... నేను ఈ రోజుకయినా తల్లినయ్యే యోగ్యత కలిగింది. ఈ లోకం నన్ను మనిషిగా చూడగలిగింది."

"అందరూ గౌరవించే మాతృత్వానికి మించిన ఆనందం మరిక లేదు."

"ఆ మాతృత్వంలోనే... స్త్రీకి ఆనందం వుండేది."

"ఆ మాతృత్వంలోనే... స్త్రీ మనిషిగా చూడబడేది..."

"నిన్ను పెళ్ళి చేసుకుని కాపురం చేసినన్నాళ్ళూ... నాకేనాడు సుఖము లేదు..గనుకే ... నా అవసరం కోసం... ఆ తప్పుచేసి... ఈనాటికయినా తల్లినై నాలో సంతోషాన్ని నింపుకున్నాను."

"నేను చేసిన ఈ తప్పును నువ్వు హర్షించవని తెలుసు. అందుకే... నా సంతోషాన్ని హరించుకోకుండా... నీ నుంచి దూరంగా వెళ్ళిపోడానికి నిర్ణయించుకున్నాను. నా కొడుకును కొన్నాళ్ళపాటు జాగ్రత్తగా పెంచి పెద్ద చేస్తే... నాకు నీడ కల్పించకపోడు."

"చివరిగా ఓ మాట... నీ కిప్పుడు భార్య లేదని... నీ నిజస్వరూపం తెలీని మీ అమ్మా, నాన్న నీకు మరో పెళ్ళి చేయడానికి సిద్ధపడితే... ఈసారయినా నీ లోపాన్ని చాటి చెప్పు. లేకుంటే... మరో అమాయకురాలకు కూడా నీ వలన గొడ్రాలనే నామకరణ సార్థకమయిపోగలదు. గొడ్రాలు అనే పిలుపులో ఎంత గుండె కోత వుంటుందో అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది. శెల"వంటూ భర్తకు మరో మాటకు అవకాశమివ్వకుండా... ఆకలితో 'అమ్మా' అని ఏడుస్తున్న తన బిడ్డను అక్కున చేర్చుకుని... ఇంటికి దూరమవుతున్న సుశీలను — నోరు తెరిచి అలాగే చూస్తూ వుండిపోయాడు ఆమె భర్త!

### ఇది నిజం

హంగేరి దేశానికి చెందిన ప్రఖ్యాత వయొలిన్ మేధావి 'రెకజోపాలి'కి మొత్తం 48 మంది కొడుకులు. వారంతా తండ్రిలాగే వయొలిన్ వాయించడంలో ప్రఖ్యాతి పొందారు.

*వనితాజ్యోతి, సెప్టెంబర్ 1990*